# గోపాల కృష్ణుడు

వి.వి. శేషారత్నం

## కాల్లాంటి కళ్ళు - పైసా అంత బుల్లి నోరు

అందంగా బొద్దుగా చిరునవ్వులు చిందిస్తూ చిట్టి చిట్టి అడుగులు వేసే గోపాలకృష్ణుడిని చంక వేసుకుని కూరల మార్కెట్‌కి బయలుదేరింది సంధ్య.

దారిలో కనిపించిన వాళ్ళందరికేసి బోసి నవ్వులు చిందిస్తూ వెలుగులు విరజిమ్ముతున్న గోపాలకృష్ణుడిని చూసి మార్కెట్‌లో అంతా మహా ముచ్చటపడి పోతున్నారు.

తల్లి చంకలో ఉన్న వాడికి ఎవరెస్టు ఎక్కినంత గొప్ప సంబరంగా ఉంది.

సంధ్యకి మాత్రం వాడినెత్తుకుని వంద గజాలు నడిచే సరికి చేతులు నొప్పి పెట్టి ఆయాసం వచ్చింది.

ఒక చేతిలో గోపాలకృష్ణుడు–
మరో చేతిలో కూరల సంచి–

ఎవరైనా తెలిసిన వాళ్ళు కనిపిస్తారేమోనని చుట్టూ చూసింది సంధ్య.

దూరంగా బెండకాయలు బేరం చేస్తున్న సుందరమ్మగారు కన్పించేసరికి హమ్మయ్య అనుకుంది.

గబగబా ఆవిడ దగ్గరకు నడుస్తూ - బుజ్జిన్నా అమ్మమ్మగారదిగో 'అంది గోపాలకృష్ణుడికి ఆవిడని చూపిస్తూ సుందరమ్మగారు తలెత్తి సంధ్యను చూసింది. పక్కలో బాంబుపడ్డట్టు ఉలిక్కిపడింది. మరో నాలుగు గజాలే వుంది దూరం ఇద్దరికీ–

అమ్మో - భయంతో ఆమె కళ్ళు పెద్దవయాయి.

'సరేనమ్మగారూ రెండ్రూపాయిలకే తీసుకోండి' అన్న కూరల వాడి మాటలు కూడా లెక్క చెయ్యకుండా కూరలు తెచ్చేందుకు తెచ్చుకున్న ప్లాస్టిక్ సంచీ జారిపోయినా పట్టించుకోకుండా ఒక్క ఉదుటున పరిగెత్తి జనంలో కలిసిపోయింది.

'ఈ ముసలమ్మకి మతి లేదేమో' - గొణుక్కున్నాడు కూరలబ్బాయి.

సంధ్య గాఢంగా నిట్టూర్చింది.

గోపాలకృష్ణుడు చిద్విలాసంగా చిరునవ్వులు చిందిస్తూనే వున్నాడు. పాపం సుందరమ్మగారు వెనక్కి తిరిగి కూడా చూడకుండా పారిపోయిందంటే ఆవిడ తప్పేసం కూడా లేదు.

ఆవిడ అనుభవం అలాంటిది.

సంధ్య, శేఖర్ ఇద్దరూ షిఫ్ట్ డ్యూటీ చేసే ఉద్యోగస్తులే– ఆ వీధిలోకి కొత్తగా వచ్చి చేరారు. ఇద్దరూ డ్యూటీకి వెళ్ళినప్పుడు ఇంటి దగ్గర గోపాలకృష్ణ చూసుకునేందుకు ఇద్దరికీ ముందూ వెనకా ఎవరూ లేరు.

చాలా వరకు కష్టపడి షిఫ్ట్‌లు అడ్జస్టు చేసుకుంటున్నా వారంలో రెండు రోజులు గోపాలకృష్ణుడిని ఎవరింట్లోనో వదిలేయక తప్పని పరైంది.

అందుకే సంధ్య చుట్టుపక్కల వాళ్ళతో ఒకేసారి ఎంతో విసుగొచ్చినా లేని ఓపిక తెచ్చుకుని కలుపుగోలుగానే ఉంటుంది. వాళ్ళడిగిన చేబదుళ్ళు తిరిగి రానివని తెలిసినా ఇస్తూనే వుంటుంది.

అయితే ఈ మధ్యకాలంలో సంధ్యను అప్పలడగడం మానేసారు అంతా - కారణం గోపాలకృష్ణుడు.

మూడ్నెల్ల క్రితం - ఆ రోజు శేఖర్ డ్యూటీ కెళ్ళాడు. ఓవర్ టైం పడింది. సంధ్య డ్యూటీ కెళ్ళాలి. ఒక్క మూడు గంటలు బాబును నాలుగిళ్ళ అవతల వున్న సుందరమ్మ పిన్నిగారి కప్పజెప్పేందుకు వెళ్ళింది. వీళ్ళ సంపు దగ్గర ఆవిడ సంధ్యను ఎంతో ఆప్యాయంగా పలకరిస్తుంది. "మా యింటికి రామ్మా" అని ఎన్నోసార్లు ఆహ్వానించింది కూడా. ఇంకా గంట టైముంది డ్యూటీకి వెళ్ళేందుకు.

గోపాలకృష్ణుడి బొమ్మలు - తిండి - పాల డబ్బా, పాల సీసా అన్ని బుట్టలో నీట్‌గా సర్ది ఇంటికి తాళం వేసుకుని సుందరమ్మగారింటికి వెళ్ళింది.

'రామ్మారా ఇన్నాళ్ళకా రావడం?' అంటూ ఎదురొచ్చి గోపాలకృష్ణుడిని అందుకుని మురిసిపోయింది ఆవిడ.

గోపాలకృష్ణుడి అందమైన నవ్వు చూసి ముసలాయన రాఘవయ్య — సుందరమ్మగారి భర్త పొంగిపోయాడు.

'అచ్చం మన బాబిగాడిలా వున్నాడు కదే.'

"ఇదమ్మా ఈయన వరస పసివాళ్ళను చూస్తే ఒళ్ళు తెలీదు'

'పిన్నిగారూ! మీరేమీ అనుకోకపోతే ఒక్క సాయం చేయాలి.'

'చెప్పమ్మా!'

'వాళ్ళ నాన్న వచ్చేసరికి లేటవుతుంది. నేను మూడు గంటల్లో వచ్చేస్తాను. అందాకా మా కృష్ణుడిని మీ దగ్గర ఆడిస్తే..."

'అయ్యో దానికేం భాగ్యం, ఈ మాత్రం దానికింత బతిమాలాలా! అసలు మాకూ కాలక్షేపం లేక ఛస్తున్నాం. మాకూ చిన్నా చితకా పాతిక మంది దాకా మనమలున్నా అంతా దూరంగా వేరే వేరే ఊళ్ళల్లో ఉన్నారు. సొంత వూరు వదల్లేక మేమిక్కడే వున్నాం. నువ్వేం బెంగ పెట్టుకోక వెళ్ళిరా. ఆలస్యమైనా ఫరవాలేదులే.'

సంధ్య పొంగిపోయింది.

అయితే సాయంత్రం తిరిగి వచ్చే సరికి సంధ్యకి ఆ వృద్ధ దంపతుల్ని చూసి నవ్వే జాలి వేసింది. నోట్లో వేలుతో గోపాలకృష్ణుడు మాత్రం చిరునవ్వులు చిందిస్తూ తల్లి చంకెక్కేసాడు.


'మీవాడు అసాధ్యుడు సుమా! తాతగారిని ఇంటి చుట్టూ పరిగెత్తించి మూడు చెరువుల నీళ్ళు తాగించేసాడు.' - సుందరమ్మగారు నవ్వుకున్నా అలసట ఆమె ముఖంలో–

'మీ పిన్నిగారిని మాత్రం వదిలిపెట్టాడుటమ్మా! ఒకటే జుట్టు పీకడం - వాడి కోసం కా కా అంటూ కాకిలా అన్నం పెట్టినంత సేపూ అరవడమే. పిన్ని గొంతు చూసావా ఎలా బొంగురు పోయిందో?'—

రాఘవయ్యగారు ఉక్రోషంగా అన్నాడు.

'అవునుగాని అమ్మాయే - నువ్వు కృష్ణుడికి అన్నం పెట్టేటప్పుడు కాకిని చూపిస్తావా ఏమిటి?'

'అవునండీ! అయినా కాకి లేకపోతే వాడు అన్నం తినడు. ఆ మాట చెప్పాలని మర్చిపోయాను. ఇంట్లో



కాకి బొమ్మని రేపు తెచ్చిస్తాలెండి.

'రేపు కూడా ఇద్దరికీ డ్యూటీ వుందా అమ్మాయ్.' భయంగా అందావిడ

'అవునండీ! పార్వతీ పరమేశ్వరుల్లా మీరిద్దరూ దొరకడం నా అదృష్టం' - సంధ్య అవకాశం వదులుకోదలుచుకోలేదు.

'దానిదేముందమ్మా అలాగే వదిలేసి వెళ్ళు'– మొహమాటంగా అంది.

మర్నాడు సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చేసరికి ముసలి దంపతుల జుట్టు పీకేసిన తాటి టెంకలా వుంది.

'భలే అల్లరి కృష్ణుడమ్మా! నువ్వెళ్ళాక ఏడుపందుకున్నాడు. ఇదిగో ఇలా జుట్టు పీకనిస్తేనే ఊరుకున్నాడు!

'అయ్యయ్యో సారీ అంటే మీకు చాలా ఇబ్బంది కలిగించాను.' నొచ్చుకుంది సంధ్య.


'అమ్మాయ్ వీడికి నిద్రపోయేటప్పుడన్నీ వింత అలవాట్లులా వున్నాయి. కాకి బొమ్మ మూలాన అరవడం తప్పినా మీ బాబాయిగారిని పడుకోమని గుండెల మీద తద్దిమితక అంటూ గెంతడం మొదలుపెట్టాడు. తర్వాత తలగడ దిండ్లని రెండింటిని పొట్ల గిత్తలా కుమ్మడం మొదలెట్టాడు.!

'తర్వాత నిన్ను కుమ్మాడని చెప్పనే. దెబ్బకి మీ పిన్నిగారికి ఒళ్ళు హూనం అయిపోయింది.'

'మీకు మాత్రం ఆయాసం రాలేదు కాబోలు.'

'ఏమైతేనేం వాడు దుప్పటి అంతా పీకేసి మొహాన కప్పుకుని నోట్లో మూడు వేళ్ళేసుకుని గాని పడుకో లేదమ్మాయ్. అయినా మరీ కోడి కునుకు, నాలు గంటకే లేచి మీ బాబాయి గారి చేత కసరత్తు చేయించే వాడు.'

సంధ్య నవ్వింది. అది వాడి అలవాటు చెప్పడం మరిపోయాను. మరో నాలుగు రోజుల తర్వాత సంధ్య వెళ్ళేసరికి వాళ్ళు బట్టలు సర్దుకుంటున్నారు.



సంధ్య అనుమానంగా చూసి-

"ప్రయాణమా పిన్నిగారూ!"

"అవునమ్మా పాతిక మంది మనవల్ని చూశాముగాని నీ గోపాలకృష్ణుడి కాలిగోటికి పోలరు. మూడు రోజు ల్నించే చెప్పడం మరిచామనుగాని మువ్విచ్చిన కాకిబొమ్మ పాడయి అరవడం మానేసింది. ఇక చూడు నిన్న మీ బాబాయీ నేనూ కాకుల్లా అరుస్తుంటే పక్కింటివాళ్ళు గాభరాగా తొంగి చూసారు. ఇంట్లో కొచ్చి మరీ కాకులు అరుస్తున్నాయి-ముసలాళ్ళు ఇద్దరూ ఒకేసారి పోయా మేమోనని."

"అయ్యో అదేంమాట!"

"అవునమ్మా అయినా మీ బాబాయిగారికీమధ్య ఆయాసం ఎక్కువయింది. కొడుకుల్ని చూడాలని మనసుపుట్టింది. అందుకే అలా అలా తిరిగి వస్తాం"

అంతే తర్వాత వాళ్ళని చూడలేదు సంధ్య.

కొంపదీసి గోపాలకృష్ణుడికి భయపడిగానీ వెళ్ళిపోలేదు కదా! ఛ. వీడిని చూసాక మనవల్ని చూడాలనిపించి వుంటుంది. అంతే-

సంధ్య సమస్య మళ్ళీ మొదటి కొచ్చింది. పోనీ వాడిని క్రెష్‌లో పెడితే?

వారానికి రెండ్రోజుల కోసమే అయినా అందులో పెట్టారు. కాని మిసెస్ పద్మ రెండు వారాలయ్యేసరికి చేతులు జోడించి మర్యాదగానే చెప్పింది.

"చూడండి మిసెస్ సంధ్యా! మీ బాబు చాలా బుద్ధిమంతుడే. కాని ఏడిస్తే మాత్రం హృదయ విదార కంగా కడుపు తరుక్కుపోయేలా ఏడుస్తాడు. నేను బ్రతుకు తెరువు కోసం ఇది పెట్టుకున్నాను. మీవాడి ఏడుపు చూసి మిగతా పిల్లలు ఏడవడం మొదలెట్టారు. మేమెవరం మేనేజ్ చెయ్యలేకపోయాం. పిల్లల తల్లిదం డ్రులు ఈ ఏడుపులు చూసి మేము పిల్లల్ని కొడు తున్నాం అనుకునే ప్రమాదం కూడా వస్తోంది. దయచేసి..."

గోపాలకృష్ణుడు అమాయకంగా. నోట్లో వేలేసుకుని ఆవిడను-తల్లిని మార్చి మార్చి చూస్తున్నాడు.

సంధ్య గాఢంగా నిట్టూర్చింది.

శేఖర్ అన్నాడు ఆ రాత్రి-

"మళ్ళీ మనం ఇల్లు మార్చాలి సంధ్యా! ఈ వీధిలో ఇంక మనవాడినెవరూ వుంచుకోరు కాబోలు."

"ఇన్నాళ్ళూ ఎంత చక్కగా వుండేవాడండీ! ఇపుడు గుమ్మం దాటితే అందరింట్లోనూ కాసేపటికి ఏడుపే."

శేఖర్ నవ్వి అన్నాడు-

"వాడికి అమ్మంటే తెలిసిపోయింది సంధ్యా! పిల్లలు ఒకే రకం వాతావరణానికి, ఆహారానికి, మనుషులకి అలవాటు పడితే అది మారితే వాళ్ళకి కిట్టదు."

అతని థీరీని ఒప్పుకోలేక పోయింది సంధ్య-"అలా అయితే పిల్లలు స్కూళ్ళకి వెళ్ళడం వట్టి మాటే మరి!"

"నిజమే, కాని ఇంకేం చెప్పాలో తోచడం లేదు మరి" బుర్ర గోక్కున్నాడు శేఖర్.

ఇద్దరి మాటలూ తనకేం అర్థం కాకపోయినా నవ్వాడు గోపాలకృష్ణుడు. వాడిని ముద్దు పెట్టుకుంది సంధ్య.

"ఎదురింట్లో మనలాంటి జంటే అద్దెకి దిగారు. ఆగండి ఆవిడని పరిచయం చేసుకుంటాను."

"బాగుండదేమో సంధ్యా! ఈ పాటికి మన గురించి ఆవిడకి తెలిసిపోయే వుంటుంది."

* * *

మర్నాడు ఉమ తనంత తనే పలకరించింది సంధ్యను.

"ఈ రోజు మీకు సెలవనుకుంటాను."

"అవునండీ!"

"ఓసారి మాయింటికి రండి."

"అలాగే" అన్న సంధ్యకి మనసులో చాల సిగ్గేసింది. పాపం ఆవిడెంతో ఆత్మీయంగా తనతో స్నేహం కలుపు కోవాలని పిలుస్తోంది. తను స్వార్థంతో వెళ్తోంది.

"ఏమిటాలోచిస్తున్నారు సంధ్యగారు! మీ వివరా లన్ని ఈ నాలుగు రోజులుగా ఈ వీథి వాళ్ళంతా చెప్పారు. మీ గోపాలకృష్ణుడి బోసి నవ్వుల వెనక అల్లరితో సహా మరి మా గురించి చెప్తాను వినండి. మా వారు కాల్టెక్స్‌లో పనిచేస్తున్నారు. మాకు ఇదిగో పాపలు ఇద్దరూ. మీలాగే నేనూ మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాను. కాని కాస్త పెద్ద వాళ్ళవుతున్నారు కనుక ప్రస్తుతం ప్రాబ్లం లేదు."

"అదృష్టవంతులు. ఈ మధ్య వీడు ఇంట్లో కూడా తెగ ఏడిపిస్తున్నాడెందుకో."

"మీ బాబుని నాకప్పజెప్పి వెళ్తూండండి ఫరవా లేదు."

తను వచ్చింది అదే ఉద్దేశం అయినా సంధ్య మనసు మార్చేసుకుంది.

"వద్దండీ వాడు చాలా ఇబ్బంది పెడతాడు."

"అల్లరి పిల్లలు చెయ్యకపోతే మనం చేస్తామా మీకేం భయం లేదు. నేను జాగ్రత్తగా చూస్తాను. నాకు బాబు అంటే చాలా యిష్టం."

మర్నాడు సంధ్య డ్యూటీ నుంచి వచ్చే సరికి ఉమ నవ్వుతూనే వుంది. గోపాలకృష్ణుడి జాడ లేదు.

సంధ్య గుండె గుభేల్‌మంది. ఏదో అనబోయింది.

'ఉష్' అని చూపుడు వేలు నోటి మీద వుంచి సైగ చేసింది తనతో రమ్మన్నట్టు ఉమ.

సంధ్య తన కళ్ళను తనే నమ్మలేక పోయింది. గోపాలకృష్ణుడు కేరింతలు కొడుతూ పాపలతో ఆడు కుంటున్నాడు. వాడి మొహంలో ఎన్నడూ చూడని వెలుగు-ఉత్సాహం. పెద్ద పాప వాడిని ముద్దు పెట్టుకుం టోంది.

తల్లిని చూసి వెంటనే వచ్చేయలేదు వాడు.

"సంధ్యగారూ ఇప్పుడర్థమయిందా? మీ వాడికి ప్రాణమున్న చిన్న బొమ్మలు కావాలి మరి. నేమీ ఊళ్ళో మూడేళ్ళుంటాం. ఈలోగా మీ వారితో చెప్పి వాడికో తోడు సంపాదించండి. తమ్ముడితోనో చెల్లాయితోనో ఆడుకుంటూ వాడు మీ జోలికి రాడు ఎక్కడ ఎవరి దగ్గర వుంచినా తర్వాత వాడికి స్కూలు ఎలాగూ తప్పదు. ఈ బాల్యమే వాడికి మధురం."

సంధ్య చెక్కిళ్ళు ఎర్ర బడ్డాయి ఉమ మాటలకి. మనసులో దిగులు తీరి ఎంతో రిలీఫ్‌గా వుంది కొడుకుని ఎత్తుకుని ఇంటికెళ్తుంటే-ఇదివరకులా అవ మానం అనిపించలేదు. నోట్లో వేలుతో గోపాలకృష్ణుడు చిరునవ్వులు చిందిస్తూ చిట్టి అడుగులు వేస్తూ తండ్రి కెదురెళ్ళాడు.